# రైతులను ఆగం చేసే కుట్ర


తెలంగాణ రాష్ట్రం చేసిన అభివృద్ధి ఫ్లెక్సీ విడుదల చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- సోన్‌లో రైతు వేదికలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


సోన్, జూలై 19: వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పాడం రైతులను ఆగం చేసే కుట్ర అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం నిర్మల్ జిల్లా సోన్‌లోని రైతు వేదికలో ప్రభుత్వం అమలు చేస్తున్న 24 గంటల కరెంట్‌ను నిరంతరంగా కొనసాగించాలని కోరుతూ రైతుల పక్షాన చేసిన తీర్మానంపై మంత్రి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగెస్ హయాంలో 9 గంటల కరెంట్‌తో పగటి పూట నాలుగు, రాత్రి ఐదు గంటలతో రైతులు రాత్రి పగలు తేడాలేకుండా పంట పొలాలకు వెళ్లి నీరు పెట్టేందుకు పోయి పాములు, తేళ్లు కుట్టి ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మూడు గంటల్లో మూడు ఎకరాలు పారుతుందనే విషయాన్ని చెప్పాడని చురకలంటించారు. రైతులను కించపరిచే విధంగా మాట్లాడినందున కాంగ్రెసోళ్లు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల పొలానికి వెళ్లి మోటర్ వేసి ఇంటికొస్తే పంట పండుతోంది. రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇంత చేసినా బీఆర్ఎస్ పార్టీ కావాలో... మూడు గంటల కరెంట్ గురించి మాట్లాడిన కాంగ్రెస్ కావాలో ప్రజలే నిర్ణయించుకొని రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని సూచించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో మరింత ఆ పార్టీ దిగజారిందన్నారు. అటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులపై ప్రజలు, నాయకులు అప్రమత్తంగా ఉండి పని చేసే ప్రభుత్వానికి తప్పకుండా రాబోయే ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అంపోలి కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఎఫ్ఎసీఎస్ చైర్మన్ రాజేందర్, ఎఫ్ఎసీఎస్ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోహినొద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ వినోద్, ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్, ప్రసాద్, గంగారెడ్డి, గంగాధర్, కాంతయ్య పాల్గొన్నారు.

## మూడు పంటలు కావాలా.. మూడు గంటల కరెంట్ కావాలా?

దస్తురాబాద్, జూలై 19 : రాష్ట్రంలో మూడు పంటల విధానం కావాలా.. కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు మూడు గంటల కరెంట్ కావాలా రైతులు ఆలోచించుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ అవసరం లేదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యాలకు నిరసనగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు.రైతులపై కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమను చూపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే అంధకారమేనని, అందువల్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మూడు పంటలు పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పచ్చని పంట పొలాలతో కళకళలాడుతుంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతులపై వివక్ష చూపుతున్నారు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ప్రభుత్వం లక్ష్మీపూర్ ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. అక్కడే దివ్యాంగుల కోటలో మంజూరైన రూ. 50 వేల చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు అందజేశారు. మండల కేంద్రంలో పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతపూరి శారదాశ్రీనివాస్, ఎంపీపీ సింగరి కిషన్, వైస్ఎంపీపీ భూక్యా రాజు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజారమేశ్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు సిర్ప సంతోష్, ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, ఏఈవో తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజనర్సయ్య, గ్రామాల రైతు బంధు సమితి అధ్యక్షులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్

## సంతకాల సేకరణ


దస్తురాబాద్ : సంతకాలు చేస్తున్న రైతులు

దస్తురాబాద్, జూలై 19 : కాంగ్రెస్,బీజేపీ పార్టీ వ్యతిరేక నిర్ణయాలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో తీర్మానించి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. దీనికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు పెట్టారు. గత పాలకుల పాలనలో పడ్డ కష్టాలు చాలు అని, ఆ రోజులు మళ్లీ రావద్దని రైతులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు.

## బీఆర్ఎస్‌తో రైతులకు ఉచిత కరెంట్


బజార్‌హత్నూర్ : బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌ను సన్మానిస్తున్న రైతులు

బజార్‌హత్నూర్, జూలై 19 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రైతులకు గతంలో ఉన్న ఇబ్బందులు తొలిగాయని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన రైతుసభలో ఆయన మాట్లాడారు. ఎంపీ రేవంత్ రెడ్డి రైతుల గురించి పార్లమెంట్‌లో మాట్లాడలేదని, గంట కరెంట్ ఇస్తే ఎకరం పారుతుంది. మూడు గంటల కరెంట్ ఇస్తే మూడు ఎకరాలు పారుతుందనే వ్యాఖ్యలు చేయడం రైతులను అన్యాయం చేయడానికి పూనుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు కరెంట్ సరఫరా చేస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని కొనియాడారు. చంద్రబాబు శిష్యరికంలో రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. తెలంగాణ రైతులకు మూడు గంటల కరెంట్ కావాలా.. మూడు పంటలు కావాలా ఆలోచించుకోవాలన్నారు. అనంతరం రైతులతో ప్రభుత్వం ఇస్తున్న కరెంట్‌పై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం, బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ భోజన్న, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

బోథ్, జూలై 19: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బుధవారం సాధన సమితి సభ్యులు ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌కు వేర్వేరుగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. పాత తాలూకా కేంద్రమైన ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల మండలాలకు పరిపాలన సౌలభ్యంగా మారుతుందన్నారు. ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సాధన సమితి సభ్యులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే 2022లో కలెక్టర్ ద్వారా సీసీఎల్ఏకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రెవెన్యూ డివిజన్ ఆశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇక్కడ సాధన సమితి సభ్యులు, అఖిల పక్ష నాయకులు ఉన్నారు.

### కరెంట్ గురించి రంది లేదు..



సోన్, జూలై 19: కరెంట్ 24 గంటలు వచ్చిన తర్వాతనే మా కష్టాలు తీరాయి. కాంగ్రెస్ హయాంలో 9 గంటల కరెంట్ ఉండే. అది ఎప్పుడు ఇస్తారో ఎప్పుడు ఇవ్వరో తెలిసేది కాదు. కరెంట్ కోసం పంట పొలాల వద్ద కండ్లు కాయలు కాసేలా చూసేవాళ్లం. వచ్చిన కరెంట్ సక్రమంగా ఉండేది కాదు. దీంతో మోటర్లు, స్టాటర్లు కాలిపోయేవి. కరెంటోళ్లకు ఫోన్ చేస్తే ఎవరూ పట్టించుకోపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల పొలంలో ఎప్పుడు చూసినా నీళ్లే. ఐదారు ఎకరాల వరకు పంటలు వేసుకుంటున్నాం. ఒక ఎకరం కూడా ఎండుతలేదు. బావి వద్దకు వెళ్లి మోటరు స్టాట్ చేసి వస్తే తెల్లరేసరికి పారుకం దిగుతోంది. ప్రతి గుంటను వదలకుండా పంటను పండిస్తున్నాం. కరెంట్ గురించి రంది లేదు. కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్ ఇస్తమంటే ముందుగా మేము కూడా నమ్మలేం. ఇప్పుడు ఇస్తున్నది చూసి మాకు ఎంతో సంతోషంగా ఉంది. కాంగ్రెసోళ్లు కరెంట్ ఇవ్వడం చేతకాలే.. ఇప్పుడు కరెంట్‌పై ఏవేవో మాట్లాడుతున్నారు. వాళ్లకు తప్పకుండా బుద్ధి చెప్పాలే.

**-లింగన్న, రైతు, సాకెర, సోన్ మండలం**

### కాంగ్రెస్ హయాంలో తిప్పలు పడ్డాం



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 9 గంటల కరెంట్ ఇస్తే ఎన్నో తిప్పలు పడ్డాం. రాత్రుల్లో పంటలకు నీరు పెట్టేందుకు ప్రాణాలకు భయపడి పనులు చేసుకున్నాం. సీఎం కేసీఆర్ పాలన వచ్చిన తర్వాత మాకు మంచి రోజులు వచ్చాయి. పంటలకు 24 గంటల పాటు ఉచిత కరెంట్ సరఫరా అవుతున్నది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ గురించి మాట్లాడుతున్నారు. మూడు గంటల కరెంట్ ఇచ్చేటోళ్లకు ఊర్లో ఏ ఒక్కరూ ఓటు వేయం. వాళ్లకు ఓటు వేస్తే మళ్లీ మూడు గంటల కరెంట్ వస్తది. మా పంటలు ఎట్ల పండుతాయి. మనమంతా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో 24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ సార్‌కు ఓటు వేద్దాం.

**-సలుగంటి లింగన్న, రైతు, సోన్**

### రైతులకు మంచి రోజులు



దస్తురాబాద్, జూలై 19 : కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. విత్తనాలు, ఎరువులు లేక చాలా నష్టం పోయాం. కరెంట్ సరిగా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చేది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు మంచి రోజులు వచ్చాయి. 24 గంటలు కరెంట్ అందిస్తూ, రైతుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నది. కరెంట్ కోసం ఎదురు చూసే పని లేకుండా పోయింది. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే పరిస్థితి లేదు. రైతు కండ్లలో ఆనందం ఉంది.

**-శివలాల్,రైతు, మున్యాలతండా**

### కరెంట్ కష్టాలు లేవు..



దస్తురాబాద్,జూలై 19 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషితో రైతులందరం సంతోషంగా ఉన్నాం, రెప్పపాటు కరెంట్ పోతాలేదు. నీళ్లు ఉండడంతో సంతోషంగా పంటలు పండించుకుంటున్నాం. రైతులు అభివృద్ధి చెందుతున్నారు. రైతు రాజ్యం రావాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి సంక్షేమం కోసం పాటుపడుతుండడంతో రైతులు ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ చాలు ఆనడం దారుణం. కాంగ్రెస్ పాలనలో చాలా నష్టపోయాం. కరెంట్ సరఫరా లేక పంటలు సరిగా పండేవి కావు. ఇప్పుడు అలాంటి తిప్పాలు లేవు.సీఎం కేసీఆర్ ఆ బాధలు లేకుండా రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుండు. మునుపటి కష్టాలు మాకొద్దు.

**-మావురికారి రాయపోశం,రైతు,ఆకొండపేట**